## క్లుప్తంగా

### సునీతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని పరిశోధకురాలు మాలోతు సునీతకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉమెన్ ఎంపవర్‌మెంటు త్రో మైక్రోఫైనాన్స్–ఏకేస్ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంతగ్రంథానికి సునీతకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు సాక్రియా పర్యవేక్షణలో సునీత పీహెచ్‌డీ పూర్తి చేశారు.

### టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కాశోజీ సెంటర్ : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మేకిరి దామోదర్, కోశాధికారి రవూఫ్, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



హసన్‌పర్తి: కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద రైతులకు అందజేస్తున్న రూ.6వేలను రూ.10వేలకు పెంచడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్పొరేషన్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాం చెంద్రారెడ్డి, మాజీఎంపీటీసీసభ్యుడు పిట్టల కుమారస్వామి,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, హరిశంకర్, సుమన్, శేఖర్ పాల్గొన్నారు.

### సందడి లేని నూతన సంవత్సర వేడుకలు

మడికొండ : పోలీసుల హెచ్చరికల మధ్య నూతన సంవత్సర వేడుకలు సందడి లేకుండా పోయింది. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో యువకులు ఎక్కువగా ఎవరి ఇళ్లలో వారే వేడుకలను జరుపుకున్నారు. మడికొండ, రాంపూర్, టేకులగూడెం, ఉనికిచర్ల తదితర గ్రామాల్లో యువకులు ఉత్సాహంతో మిఠాయిలు పంచుకుని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లు కిషన్ తమ సిబ్బందితో విస్తృత తనిఖీలు చేపట్టడంతో యువకులు రోడ్ల మీదకు రాలేదు.

### అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



కాజీపేట: పట్టణంలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో బుధవారం 200 మంది అనాథ వృద్ధులకు దుప్పట్లు, బ్రెడ్ ప్యాకెట్లను అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కృష్ణంరాజు పంపిణీ చేశారు. రైల్వే కాంట్రాక్టర్ పి.సురేష్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రైల్వే అధికారులు అనాథలకు చేయూతనందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, అయ్యాల దానం, పి.శివకుమార్, ఎండీ.అఫ్జల్, కె.మల్లేశం, యూత్ సభ్యులు రాజేష్, ప్రదీప్, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

ఖిలా వరంగల్ : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని మిల్స్ కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నం అన్నారు. వరంగల్ శంభునిపేట హనుమాన్ దేవాలయంలో హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణ, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బలరాం, కందికొండ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు నీడలో ఇక్బాల్ మినార్

- నిర్మాణానికి నిధులు మంజూరు
- ఏళ్లు గడుస్తున్నా అడుగు పడని దుస్థితి

న్యూశాయంపేట : జాతీయ సమైఖ్యతకు, భారతీయ గంగా జమునా సంస్కృతికి ప్రతీకగా ప్రముఖ కవి, సారే జహాసే అచ్చా హిందుస్తాన్ హమారా గేయ రచయితగా పేరుగాంచిన అలామా ఇక్బాల్ గుర్తుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఇక్బాల్ మినార్ నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. అప్పటి ప్రభుత్వం ఉర్దూ, పార్సీ, భాషలో కవి, గేయ, రచయితగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఆయన స్మారకార్థం ఉమ్మడి జిల్లాలో మినార్‌లు నిర్మించారు. కానీ కొంత కాలంగా పాలకుల నిర్లక్ష్యంతో ఆ ఊసేలేకుండా పోయిందని మైనారిటీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు దృష్టి సారించి నూతన మినార్ నిర్మించాలని కోరుతున్నారు.

**2002 సంవత్సరంలో నిర్మాణం....**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా కుడా నిధులతో అప్పటి చైర్మన్ హరిహరప్రసాద్, అప్పటి కుడా డైరెక్టర్ ఎక్బాల్ దర్ద్ పట్టుదలతో నిర్మించారు. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పలు మైనారిటీ సంఘాల కోరిక మేరకు 2018లో టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖ కాంప్లెక్స్ ఎదుట ఉన్న మినార్‌ను మధ్యలో ఏర్పాటు చేయుటకు నిర్ణయించారు. దీనికోసం రూ. 9.50 లక్షలు మంజూరు చేశారు. కాగా మున్సిపల్ అధికారులు రోడ్డు మధ్యలో నిర్మాణానికి అనుమతి ఇవ్వక అడ్డుచెప్పడంతో నిర్మాణాన్ని నిలిపివేశారు. అప్పట్లో మైనారిటీ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ చొరవ తీసుకుని నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మినార్‌కు ఫ్లెక్సీలు, పోస్టర్లు, కర్రలు అమర్చిన దృశ్యం

**మినార్ నిర్మాణం చేపట్టాలి**



ఇక్బాల్ మినార్ నూతన నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. వరంగల్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో నగరంలోని జంక్షన్‌లలో ఎక్కడా కూడా మైనారిటీల గుర్తింపు నిచ్చే ఆనవాళ్లు లేవు. అన్ని వర్గాలకు అధిక ప్రాముఖ్యత నిస్తూ వరంగల్‌లో అత్యధిక ముస్లిం జనాభా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా పాలకులు పట్టించుకోవాలి.

– ఇక్బాల్ దర్ద్ (కుడా మాజీ డైరెక్టర్) ఉర్దూ కవి, రచయిత

# బహుజనవీరుల చరిత్ర తెలుసుకోవాలి



సదస్సులో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల బాధ్యులు

- విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్

హన్మకొండ చౌరస్తా/హన్మకొండ: బహుజన వీరుల వీరోచిత చరిత్రను తెలుసుకున్నప్పుడే భారత్‌లో బహుజన రాజ్యం స్థాపించగలమని విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్ అన్నారు. 207వ శౌర్య దివస్ వేడుకల సందర్భంగా హనుమకొండ కొత్తూరు కమ్యూనిటీహాల్‌లో బుధవారం భీమాకోరేగావ్ యుద్ధం–చారిత్రక దృక్పథంపై సదస్సు నిర్వహించారు. పూలే యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు తాడిశెట్టి క్రాంతి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన ఓటు హక్కు ఆయుధంతో బహుజన రా జ్యాన్ని స్థాపించాలని అన్నారు. బహుజన వీరుడు శివాజీమహారాజ్, వారసత్వ రాజులను కుట్ర పూరితంగా హతమార్చిన పీష్వా రాజ్యంతో వీరోచిత పోరాటం చేసి విజయం సాధించిన చరిత్రలను దేశ ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. అలాగే హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మదుపాక ఎల్లయ్య అధ్యక్షతన బీమా కోరేగాం యుద్ధ వీరుల 207వ శౌర్య దివస్ జరుపుకున్నారు. శ్రీనివాస్, సాయిని నరేందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల బాబు, మొకాల యాదగిరి, బీఎస్పీ నాయకుడు గంధం శివ, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ట్రైబల్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉదయ్ సింగ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ వైస్‌చైర్మన్ పటేల్ వనజ, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు, మంజుల, ప్రసాద్, ఓంకార్, స్వరూప, ఫరీద, సద్గుణ, రాకేష్, కృష్ణగౌడ్, సాయితేజ, నవీన్, కొమురయ్య, బాబు, ఎల్లయ్య పాల్గొన్నారు.

# మీ భద్రత మీ చేతుల్లోనే..

- రహదారి భద్రత జీవన విధానం కావాలి
- వరంగల్ ఎంవీఐ జేపాల్‌రెడ్డి

ఖిలావరంగల్ : రహదారి భద్రత మీచేతుల్లోనే ఉంటుందని, ఇందుకు రహదారి భద్రత ఒక నినాదంలా కాకుండా సామాజిక బాధ్యత, జీవన విధానంగా మల్చుకున్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని రవాణాశాఖ సీనియర్ ఎంవీఐలు జేపాల్‌రెడ్డి , శోభన్‌బాబు సూచించారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో రవాణాశాఖ ఉపకార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు ప్రమాదాలపై హెవీ వెహికిల్స్ వాహనాల డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు, డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాలల్లో పరిమితిని మించి ప్రయాణీకులు, ఓవర్‌లోడ్‌ను అనుమతించవద్దని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడుపరాదన్నారు. వాహనదారులు రాత్రివేళల్లో వాహనాన్ని నిలిపి ఉంచినప్పుడు పార్కింగ్ లైట్లు తప్పనిసరిగా వేసి ఉంచడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ నరేందర్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఖిలావరంగల్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీఏ అధికారులు

**నిబంధనలు పాటిస్తాం**

హసన్‌పర్తి : మోటారు వాహనచట్టంలో పొందుపర్చిన నిబంధనలు పాటిస్తామని లారీడ్రైవర్లు ప్రతిజ్ఞ చేశారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయరోడ్డు భద్రత వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమ్యాయి. కార్యక్రమానికి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తోటి వాహన చోదకుడిని గౌరవించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐ కిశోర్, రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన అభివృద్ధి కమిటీ సభ్యులు



హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, సభ్యులు కలిశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో అధ్యక్షుడు, సభ్యులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచారు. కలిసిన వారిలో అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, ఉపాధ్యక్షుడు డి.కమలాకర్ రావు, జాయింట్ సెక్రెటరీ ఆకుల శ్యాం ప్రసాద్, డైరెక్టర్‌లు ఉన్నారు.

# మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి

హన్మకొండ: డ్రైవర్లు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని బ్రహ్మకుమారి సునీత అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ వరంగల్–1 డిపోలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించవచ్చనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. డ్రైవర్లు జాగ్రత్తగా, ఏకాగ్రతతో బస్సు నడిపి ప్రయాణీకులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాలన్నారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మాట్లాడుతూ డ్రైవర్లు శారీరంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. వరంగల్–1 డిపోను జీరో ఆక్సిడెంట్ డిపోగా నిలుపాలన్నారు. డిప్యూటీ ఆర్‌ఎం (ఆపరేషన్) కేశరాజు భాను కిరణ్ మాట్లాడుతూ దేశంలో రోడ్డు యాక్సిడెంట్ల వల్ల ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని, ప్రమాదాలతో ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఏప్రిల్ 2024 నుంచి నవంబర్ వరకు సుమారు రూ.48 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు, అసిస్టెంట్ మేనేజర్లు సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి సునీత

## క్రైం కార్నర్

**సెప్టిక్ ట్యాంక్‌లో పడి వ్యక్తి మృతి**

మడికొండ : ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంక్‌లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాజీపేట మండలం భట్టుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..ములుగు జిల్లా జంగాలపల్లి గ్రామానికి చెందిన కేతిరి ఎల్లయ్య(54) కొద్ది నెలలుగా హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో నివసిస్తూ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 5 నెలల నుంచి భట్టుపల్లి శివారులో బండారి మనోజ్‌కుమార్ కొత్తగా బిల్డింగ్ నిర్మిస్తుండగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి యజమాని చూడగా సెప్టింక్ ట్యాంక్‌లో పడి మృతి చెందినట్లు పోలీసులకు సమచారం అందించాడు. పోలీసులు మృతుడి కుమార్తె పాలకుర్తి స్వప్నకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ సీఐ కిషన్ తెలిపారు.

**ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య**

వరంగల్: నగరంలోని దేశాయిపేటకు చెందిన జన్ను సమ్మక్క(60) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఇంతేజార్‌గంజ్ సీఐ షుకుర్ తెలిపారు. సమ్మక్క భర్త నాలుగేళ్ల క్రితం చనిపోగా అదే మనసులో పెట్టుకొని బాధతో తనలో తాను మదనపడుతూ దేశాయిపేటలోని స్మశానవాటికలోని తన భర్త గోరి వద్దకు వెళ్లి పక్కనే ఉన్న చెట్టుకు తన చీరకొంగుతో ఉరివేసుకుని చనిపోయిందన్నారు. మృతురాలి కొడుకు జన్ను బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

**గంజాయి మత్తులో యువత హల్‌చల్**

ఖిలా వరంగల్/న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ జ్యోతిబసనగర్‌లో బుధవారం రాత్రి యువత గంజాయి మత్తులో హల్‌చల్ చేశారు. ఇదేంటని అడిగిన నానాజి వ్యక్తిపై దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. యువత మత్తుకు బానిసై దాడులకు తెగపడుతున్నారని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులకు పట్టింపులేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా చింతల్ ఏరియాలో పోలీసుల గస్తీని మరింత ఉధృతంగా చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

**డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు**

వరంగల్ : 31 డిసెంబర్ రాత్రి శాంతి భద్రతల దృష్ట్యా మద్యం తాగి రోడ్లపై సంచరించే ఆకతాయిల కట్టడి నిమిత్తమై ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరంగల్ చౌరస్తా, హెడ్‌పోస్ట్ ఆఫీస్, పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ జంక్షన్లలో ట్రాఫిక్ తనిఖీ, వరంగల్ బస్టాండ్ రైల్వే స్టేషన్, వెంకట్రామ జంక్షన్, మండిబజార్, దేశాయిపేట్, లక్ష్మీపురం బొడ్రాయి వద్ద పికెట్స్ పెట్టి, రాత్రి పూట సంచరిస్తున్న 52 బైకులు 2 కార్లను ఆపారు. అందులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారు 10 మంది ఉండగా వారిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు పెట్టి అన్ని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి తిరిగి అప్పగించామని తెలిపారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు, పార్టీల నాయకులు, యువత, పిల్లలు ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి కేక్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఒకరినొకరు నూతన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువత తెల్లవా రుజామున అందమైన రంగురంగుల ముగ్గులు వేసి శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, నెట్‌వర్క్



నయీంనగర్: ప్రెస్ క్లబ్‌లో కేక్ కట్ చేస్తున్న ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు



కాజీపేట : వేడుకలు జరుపుకుంటున్న ఉద్యోగులు



హనుమకొండ : చిన్నారితో కలిసి కేక్ కట్ చేస్తున్న అనితారెడ్డి



హసన్‌పర్తిలో : కేక్ కట్ చేస్తున్న స్థానికులు




రాంనగర్‌లో ముగ్గు వేస్తున్న యువతి



మడికొండ: స్వయంభూ లింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వరంగల్ లీగల్: బార్ అసోయేషన్‌లో కేక్‌ను కట్ చేస్తున్న జీవన్ గౌడ్

### డివైడర్‌ను ఢీకొట్టిన కారు

మామునూరు: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక డివైడర్‌ను కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారందరూ క్షేమంగా బయటపడ్డారు. ఆర్టీఏ జంక్షన్ నుంచి నాయుడు పెట్రోల్ బంక్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక డివైడర్లకు స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, రోడ్డుపై చీకటిగా ఉండటంతో ఎక్కువ సంఖ్యలో డివైడర్‌ను వాహనాల ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

# శ్వేతార్కుడికి నిత్య కల్యాణ వేడుకలు

కాజీపేట : కాజీపేట స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బుధవారం పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బుద్ధి, సిద్ధి సమేత ఆదిగణపతికి నిత్యకల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వహకులు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు సాగాయి. రాధాకృష్ణ శర్మ ఉత్సవమూర్తులకు కళ్యాణం జరిపించారు. కాజీపేట పట్టణంలోని పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. కార్పొరేటర్ రవీందర్ యాదవ్‌తో పాటు ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి, శ్రీనివాస్, సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్నను దర్శించుకున్న సీపీ

ఐనవోలు: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి మల్లన్న చిత్రపటాన్ని బహూకరించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఏసీపీ తిరుపతి, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీ అంబర్ కిషోర్ ఝాకు మల్లన్న చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

### నేత్రపర్వంగా అయ్యప్ప నగర సంకీర్తన

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో ఎరుమేలి ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సమితి గురుస్వామి బత్తిని సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వాహనంపై అయ్యప్పస్వామి నగర సంకీర్తన నేత్రపర్వంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై అయ్యప్పను ప్రతిష్ఠించగా సతీష్‌గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి శోభాయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో రామారావు, కృష్ణారావు, మల్లయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

**అయ్యప్ప భక్తసేవాశ్రమంలో ప్రత్యేకపూజలు**

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి రోడ్‌లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం దేవాలయ వ్యవస్థాపకులు టీఆర్ బాలసుబ్రమణ్యశర్మ, నిర్వాహక అర్చకులు గణపతిశర్మ ఆధ్వర్యంలో ఉదయం 3 గంటల నుంచి స్వామివారికి పంచామృతాలతో, విశేషద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. వందలాది మంది అయ్యప్ప భక్తులకు ఇరుముడి కట్టడం జరిగిందని తెలిపారు.

### ఎంపీని కలిసిన టీచర్స్ కాలనీ కమిటీ



హన్మకొండ/విద్యారణ్యపురి: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని టీచర్స్ కాలనీ–1 ప్రగతిమిత్ర కమిటీ బాధ్యులు, కాలనీవాసులు కలిశారు. బుధవారం హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని స్వగృహంలో ఎంపీ, ఎమ్మెలేను వారు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. కలిసిన వారిలో ప్రగతి మిత్ర కమిటీ ప్రతినిధులు పి.రాంరెడ్డి, సత్యనారాయణ, ఇ.పుల్లయ్య, రాజలింగ్, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, వీరారెడ్డి, రఘురామి రెడ్డి, మధుకర్, శ్రీనివాస్, స్వరూప, భానుమతి పాల్గొన్నారు.